# లవర్స్ మస్ట్ లెర్న్

నాటకం జోరుగా సాగుతూంది. ప్రయోక్త హీరోయిన్‌ని అడుగుతున్నాడు-

"సుధాకర్‌ని మీరు ప్రేమిస్తున్నారా?"

"సిల్లీ....దీనికి ప్రేమ అనేటంత పెద్దపదం ఎందుకు? స్నేహం అనండి! ఆ మాటకొస్తే నా బ్యూక్ కారునీ, బొచ్చుకుక్కనీ ఎలా ప్రేమిస్తున్నానో నా సుధానీ అలానే ప్రేమిస్తున్నాను—"

"నాటకం చూస్తున్న పాణి కుర్చీలో పక్కకి వంగి శాస్త్రితో రహస్యంగా—"గురూ, అసలు ప్రేమ అంటే ఏమిటి?" అన్నాడు.

"నోర్మూయ్యి, వెధవ డౌట్సూ నువ్వూను" అంటూ కసిరాడు. మళ్ళీ స్టేజివైపు దృష్టి సారించేడు. నాటకం సాగుతూంది.

"అంటే మీ ఉద్దేశ్యంలో స్నేహాన్నీ, ప్రేమనీ, విడదీస్తున్న ఒకే ఒక పొర సెక్స్ అంటారు అంతేగా!"

"మీరు అడిగేది అబ్బాయికీ, అమ్మాయికీ మధ్య వున్న స్నేహం గురించే అయితే మీరు చెప్పేది నిజమే" అంది హీరోయిన్.

"అయితే, స్నేహం ప్లస్ సెక్స్ ఈజ్ ఈక్వల్టు ప్రేమ, ఇంతేనా ప్రేమకి నిర్వచనం."

పాణి మళ్లీ పక్కకివంగి, స్నేహితుడివైపు తిరిగి, "ప్రేమకి ఈ డెఫినిషన్ బాగుంది కదూ?" అన్నాడు.

"నువ్విలా మధ్య మధ్యలో వెధవ కామెంట్స్ చేసేవంటే చందా లేసుకుని మరీ తన్ని పంపిస్తారు. తిన్నగా కూర్చుని మాట్లాడకుండా చూడు!" విసుక్కున్నాడు శాస్త్రి.

"నే చెప్పేది ఏమిటంటే...." అంటూ పాణి ఏదో చెప్పబోతూ వుంటే వెనక నుంచి ఎవరో "ష్!" అన్నారు. పాణి మరి మాట్లాడలేదు. కానీ, అతని ఆలోచనలు ఆ ప్రశ్న దగ్గిరే ఆగిపోయినాయి. ఆ ఆలోచన లతో నాటకం ఎప్పుడు పూర్తయిందో గమనించలేదు అతను.

"ఒరేయ్, ఇకలే" అంటూ శాస్త్రి తట్టిలేపుతూ ఉంటే అతని వైపు సాలోచనగా చూస్తూ "ప్రేమంటే ఏమిటి?" అన్నాడు. శాస్త్రికి చిర్రెత్తింది. "ఏరా....నీకేమైనా మతిపోయిందా?" అంటూ కుర్చీలోంచి రెక్క పట్టుకుని లేవదీసేడు పాణిని.

"కాదు, గురూ. ఇది నిజంగా మంచి ప్రశ్న. నువ్వూ ఆలోచించి చూడు" అంటూ సలహా ఇచ్చేడు పాణి. "ప్రేమంటే ఏమిటి."

"ఏడిసేవు. దానికేంగానీ కావాలంటే ఈ నాటక రచయితని పరిచ యం చేస్తాను పద. అతన్ని అడుగుదువు గాని నీ ప్రశ్న" అంటూ గ్రీన్ రూమ్‌లోకి తీసికెళ్ళేడు.

ఆ గది అంతా హడావుడిగా ఉంది. అద్దాల ముందు కూర్చునికొం దరు మేకప్ తుడిచేసుకుంటున్నారు. కొందరు స్టేజి ప్రోపర్టీ సర్దుతున్నారు. వీటిన్నిటికీ దూరంగా నిలబడి చీకట్లోకి చూస్తున్న ఒకాయన దగ్గిరకి తీసుకెళ్ళి పాణిని పరిచయం చేశాడు శాస్త్రి.

"ఇదిగో ఇతనే ఈ నాటిక రచయిత."

"హలో!" అంటూ షేక్ హేండ్ ఇచ్చేడు. "నా పేరు పాణి. ఇండో—పాన్ కంపెనీ సెక్రటరీని" అంటూ పరిచయం చేసుకొన్నాడు.

"నీ నాటకం చూశాక మా వాడికో అనుమానం వచ్చిందోయ్, కొం చెం తీరుద్దూ" అనేసి, ఎవరో పిలిస్తే వెళ్ళిపోయేడు శాస్త్రి.

"మీ నాటకం చాలా బాగుంది" అన్నాడు పాణి ఉపోద్ఘాతంగా.

"థాంక్స్" అన్నాడు కవి మొహమాటపడి.

"పోతే ఒక చిన్న అనుమానం...."

"అడగండి."

"ఈ నాటకంలో మీరు ఏం చెప్పదల్చుకొన్నారు?"

కవి బిత్తరపోయాడు. క్షణం సీరియస్‌గా శూన్యంలోకి చూశాడు. తరువాత పాణివైపు తిరిగి, "నిజమేనండీ. నాకూ తెలియటంలేదు- ఎంత ఆలోచించినా" అన్నాడు బిక్క మొహం పెట్టి.

ఈసారి తెల్లబోవటం పాణి వంతయింది. "అహఁ! నా ఉద్దేశ్యం అది కాదు. ఈ నాటకం—" అంటూ పేరు గుర్తురాక ఆగిపోయాడు.

"రంగులనీడ" అందించేడు కవి.

"ఆఁ అదే రంగులనీడ....సబ్జెక్టు బాగుంది గురూగారూ. కానీ ఇది చూస్తూ ఉంటే నాకో చిన్న అనుమానం వచ్చింది. అసలు ప్రేమంటే ఏమిటి?"

ఒక క్షణం మళ్ళీ శూన్యంలోకి చూచాడు కవి. తరువాత ఒక్కసారి "హా" అని మూలిగాడు "ప్రేమ" అని గొణిగి, మళ్ళీ "హుఁ" అన్నాడు భారంగా. తరువాత కళ్ళు సగం మూసి మళ్ళీ చీకట్లోకి చూస్తూ "ప్రేమ!" అన్నాడు అంతే! ఆ తరువాత అలాగే నిశ్చలంగా ఉండి పోయాడు.

పాణికి భయం వేసింది. చుట్టూ చూచాడు. ఎవరి పనిమీద వాళ్ళు ఉండటంతో ఎవరూ వీళ్ళను చూడటం లేదు.

"గురూ గారూ!" నెమ్మదిగా పిలిచాడు.

కవి మాట్లాడలేదు.

"సమాధానం చెప్పకపోతే పోన్లెండి. మీరిలా మనసు పాడుచేసు కోకండి" అన్నాడు ఓదార్పుగా.

"షేమ్!" అరిచాడు కవి- "గంటసేపు నా నాటకంలో చర్చించిన సబ్జెక్టు గురించి నేను చెప్పలేకపోవటమా?"

"ఇంత సేపూ ఆలోచిస్తూ ఉంటే...." నసిగాడు పాణి.

కవి వేదాంతిలా నవ్వేడు. "ఆలోచనకాదు" అన్నాడు గంభీరంగా.

"మరి?"

"ఇన్స్పిరేషన్ రావాలి!"

కవి మొహంలో నెమ్మది నెమ్మదిగా మార్పు వచ్చింది. పిడికిలి బిగించి, గుండె నిండా ఊపిరి పీల్చుకున్నాడు—"ప్రేమ! రెండు హృదయాల అస్తిత్వపు స్పందన! భవబంధాలకూ, ద్వేషవిద్వేషాలకూ అతీతమైన ప్రపంచంలో రెండు విభిన్న దృక్పథాల కలయిక. ప్రేమ రాహిత్యంలో బ్రతుకుతున్న ఈ మనుష్యులకు అర్థంకాని ఒక రాగరంజిత రసానుబంధం. రెండు హృదయాల మీద పలికేటకరాగం. ఈ అనురాగపు అర్ణవంలో అమావాస్య చీకట్లు, ఆర్తి అఘాతాలు గుర్తుకురాని ఒక మహిమాన్వితమైన అనుభవం- అర్థమైందా?"

పాణి బిక్క మొహం పెట్టి, 'అర్థమైం' దన్నట్టు-తల ఊపేడు.

"సిగరెట్టొకటి ఇవ్వండి" అన్నాడు కవి. పాణి ఇచ్చాడు.

కవి దాన్ని జేబులో పెట్టుకుని, "మీకు పెళ్లయిందా?" అని అడిగేడు. లేదన్నట్లు తల ఊపేడు.

"ఎవర్నన్నా ప్రేమించాలని ఉందా?"

అర్థం కానట్టు చూసేడు పాణి. కవి మాట మారుస్తూ, "మీకు స్కూటరుందా?" అన్నాడు.

"ఉంది" అన్నాడు పాణి అర్థం కానట్టు మొహంపెట్టి.

"బాంక్ బాలెన్స్?"

లేదన్నాడు పాణి అతని వైపు అనుమానంగా చూస్తూ.

"డబ్బు బాగా ఖర్చు పెడతారన్న మాట" నవ్వుతూ అన్నాడు కవి. సంభాషణ ఇలా ఎందుకు మార్చేశాడో అర్థం కాలేదు పాణికి.

అంతలో హీరోయిన్ వచ్చిందక్కడికి. "ఏం కవిగారూ, ఎలా ఉంది నా నటన? మీ రూహించిన పాత్రకి సరిపోయేనా?" అంది నవ్వుతూ

"అమ్మమ్మ, ఎంత మాట! వేసే వేషానికి అడ్డేమిటి" అంటూ చిన్న మెలోవేసి పాణివైపు తిరిగి, "ఈమె పేరు లత మా హీరోయిన్" అంటూ పరిచయం చేసేడు.

"నమస్తే" అన్నాడు పాణి.

"ఈయన పాణి. ఇండో– పాన్ కంపెనీ సెక్రటరీ" అన్నాడు. విస్ఫారితమైన కళ్లతో పాణి వైపు చూసి చప్పున కళ్ళు దించుకుని ప్రతి నమస్కారం చేసింది.

"హైదిహై, గురూ గారూ. మీరొక్కరేవచ్చేరా? మీ మిసెస్ కూడా వచ్చేరా?" అని అడిగేడు.

పాణి కొంచెం ఆశ్చర్యపోయి, "నాకింకా పెళ్ళికాలేదు." అన్నాడు.

"అయితే కొంచెం ఉండండి. నన్ను కోతీలో డ్రాప్ చేద్దురుగాని స్కూటర్లో" అన్నాడు చివరి పదం ఒత్తిపలుకుతూ.

"ఒక అయిదు నిముషాల్లో వస్తాను. ఈ లోపులో మీరు మాట్లా డుతూ ఉండండి" అంటూ వెళ్ళబోయి, మళ్ళీ వెనక్కి తిరిగి, "మీప్రశ్నకి జవాబు తొందర్లోనే అనుభవం ద్వారా రావాలని మై విష్" అనేసి వెళ్ళి పోయేడు.

"ప్రశ్నేమిటి?" అంది లత. పాణి, లత ఇద్దరే మిగిలేరు.

"పోనీండి, ఆ విషయం ఇప్పుడెందుకు?" అని తప్పించేడు.

ఒక క్షణం మౌనంగా గడిచింది.

"ఇక్కడంతా గొడవగావుంది. అలా బయటికి వెళదాం రండి. వీళ్ళ మేకప్ తియ్యడం పూర్తియ్యేసరికి పదినిమిషాలు పడుతుంది." అంటూ

బయటకు దారి తీసింది. పాణి ఆమెని అనుసరించాడు. ఆడిటోరియమ్‌వెనక తలుపునుంచి బయటకు వచ్చారు. అంతా నిర్మానుష్యంగా వుంది. వెన్నెల పిండారబోసినట్టు వుంది.

ఒక నిమిషం ఎవరూ మాట్లాడలేదు. లతే ముందు కదిలించింది. "ఏమిటి, అలా మౌనంగా వుండిపోయేరు?"

పాణి నవ్వి "ఏం లేదు" అన్నాడు.

"నాకు మౌనంగా ఉండే వాళ్ళంటే ఇష్టం" అంది సాలోచనగా. "నిజానికి నాకీ నాటకాలంటే ఇష్టంలేదు. ఇంత గొడవ భరించలేను కూడా. కానీ ఏం చెయ్యను? మా అమ్మ కోసం. మా తమ్ముడిని చదివించటం కోసం నా మనస్సుని చంపుకున్నాను. ఇలాగే వెన్నెల్లో కూర్చుని ఆలోచిస్తూ ఉండి పోవాలంటే నాకు చాలా ఇష్టం. కానీ, ఎలా కుదురుతుంది?" ఆకస్మాత్తుగా ఆమె కంఠంలో విచారం ధ్వనించింది.

పాణి బాధపడుతూ, "ఐ యామ్ సారీ! మీ మనసు అనవసరంగా పాడుచేసేను" అన్నాడు.

"లేదు లేదు, ఎందుకో మిమ్మల్ని చూడగానే ఆత్మీయుల్లా మనసులో బాధ అంతా విప్పి చెప్పుకోవాలని అనిపించింది. అందుకే మీతో ఎక్కువ పరిచయం లేకపోయినా నా గొడవంతా చెప్పి మిమ్మల్ని బాధ పెట్టేను. ఏమీ అనుకోరుగా" అంది.

"అనుకోను" అన్నాడు పాణి.

"నాకు తెలుసు....మీరు చాలా మంచివాళ్ళు" అంది. "మీరు అదృష్టవంతులు. మీకీ ఫీల్డుతో పరిచయం లేదు. ఇందులో బ్రతకటం చాలా కష్టం. ముఖ్యంగా నాలాటి అమ్మాయి."

"పోనీ, ఎవర్నన్నా మంచి అబ్బాయిని చూసి పెళ్ళిచేసుకో కూడదూ?"

లత శుష్కంగా నవ్వి, "హుఁ.... పెళ్ళా? ఎవరు చేసుకుంటారు–అందులో నాలాటి దాన్ని? ప్రేమిస్తున్నానూ అనే సాకుతో...." అంది.

పాణి మరి వినలేదు. ప్రేమ పేరు వినగానే అతనికి తన సందేహం గుర్తుకు వచ్చింది. ప్రేమ! ఎంత అందమైన ఆత్మవంచన! అనుకున్నాడు. మళ్ళీ అంతలోనే 'ఇదేమిటి? నా మెదడు యింత క్రిమినల్‌గా ఆలోచిస్తూంది?' అనుకున్నాడు.

"ఏమిటి, మళ్ళీ ఆలోచనల్లోకి జారుకున్నారు?" అంది లత.

పాణి నవ్వి "ఏం లేదు" అన్నాడు.

"కాదు. మీరు చాలా అన్యమనస్కంగా వున్నారు. ఏమిటో నాకు చెప్పరూ?" అంది చనువుగా.

"ఏమీ లేదు. మీ నాటకం చూశాక, అందులోనూ ముఖ్యంగా మీ డైలాగులు విన్నాక నాకో అనుమానం వచ్చింది. అసలు ప్రేమంటే ఏమిటి?" అని.

లత అతనివైపు ఆశ్చర్యంగా చూసింది, క్రమంగా ఆమె బుగ్గలు ఎర్రబడ్డాయి. "నాకూ తెలియలేదు. తెలుసుకునే అవసరం కూడారాలేదు ఇప్పటివరకూ? కానీ, ఇప్పుడు మీ ప్రశ్న వింటూంటే...." అంటూ సిగ్గుతో నేల చూపులు చూస్తూ మధ్యలో ఆపుచేసింది.

పాణికి తల గిర్రున తిరిగిపోయింది. తనని తను సంబాళించుకుని "నిజంగానా లతా?" అన్నాడు డ్రమెటిక్‌గా.

"నిజం, శేఖర్" అంది అడుగు ముందుకేసి.

"నా పేరు పాణి" అంటూ సరిదిద్దాడు.

"నిజం, పాణి! ఈ లోకంలో ఎవర్నీ నమ్మలేక అసలు ప్రేమ అనే పదాన్నే నా జీవితంలోంచి తుడిచేసుకోవాలని అనుకున్నాను. కానీ...."

"లతా" అంటూ అడుగు ముందుకేసి ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"వద్దు శేఖర్" అంటూ విడిపించుకోబోయింది.

"నా పేరు పాణి" అన్నాడు విసుగ్గా.

"వద్దు, పాణీ, మనది అలౌకికమైన ప్రేమ. రెండు నిమిషాల్లో ఒకర్ని ఒకరం పూర్తిగా అర్థం చేసుకున్నాం. మన ప్రేమని ఈ తుచ్ఛమైన కోర్కెలతో బలిచేసుకోవద్దు" అంది ఇమోషనల్‌గా!

పాణి కరిగిపోయేడు. "లతా!" గంభీరంగా అన్నాడు. "ఈ అనుభవాన్ని నా స్మృతుల పుటల్లో జాగ్రత్తగా దాచుకుంటాను."

"ఈ అభాగ్యురాలికి ఇంతకన్నా కావలసింది యింకేముంది....?" అంది లత. అంతలో శాస్త్రి తన గురించి ఎవర్నో అడగటం వినిపించింది. "వెళ్ళొస్తాను లతా" అన్నాడు భారంగా. ఇద్దరూ వెనక్కి తిరిగారు, "రేపు ఆదివారం కదా ? రేపు మధ్యాహ్నం మీకేదయినా పని వుందా?" అడిగింది.

"ఉహుఁలేదు" అన్నాడు పాణి.

"రేపు నవరంగ్‌కి మాట్నీ కొస్తారా?"

ఆమె కళ్ళలోకి తన్మయంగా చూసి, "వద్దు లతా!" అన్నాడు పాణి. "మన అలౌకికమైన ప్రేమని మాట్నీల్లోనూ, సెకండ్‌షోల్లోనూ ప్రదర్శించుకోవద్దు. భద్రంగా గుండెల్లోనే దాచుకుందాం. పోతే మీ అత్యంత ఆప్తునిగా మీకో సలహా ఇవ్వమంటారా....? పాడవ్వాలనుకుంటే పూర్తిగా పాడవండి. అంతే కానీ, ఈ మానసిక వ్యభిచారం వద్దు."

* * * *

పాణిని చూడగానే "ఏరా, ఎక్కడికి వెళ్ళేవ్ యింతసేపూ...." అంటూ చిరాకుపడ్డాడు. పాణి నవ్వి ఊరుకున్నాడు. వెనకనే వస్తూన్న లతని చూడగానే శాస్త్రి కళ్ళు చిట్లించేడు అనుమానంగా ఏదో అడగ

బోయేడు. అతన్ని మాట్లాడనివ్వకుండా "మరి పోదామా, గురూ....?" అన్నాడు పాణి.

"మాట మార్చకోయ్....కొంచెం జాగ్రత్తగా వుండు."

"అంటే?" అన్నాడు పాణి అర్థంకానట్టు.

"ఆ అమ్మాయి మనుషుల్ని మామూలుగా పాడుచేస్తే ఫరవాలేదు. కానీ, ఏమీ లేకుండానే పెద్ద పెద్ద మాటలు చెప్పి అనవసరంగా మనసు పాడుచేస్తుంది."

పాణి నవ్వేడు "ప్రేమించటం అంటే ఏమిటో నాకు తెలియక పోవచ్చు. కానీ, కాగితప్పూలని గుర్తించలేనంత అమాయకుడిని కాను" అన్నాడు.

"నిజమే, కానీ, ఒక మంచి అనుభవాన్ని ఇలా పాడు చేసుకోకు" అని అంటూ వుండగా, కవి వచ్చేరా దక్కడికి.

"మీ పనయిపోయిందా గురూగారూ?" అన్నాడు పాణి.

"లేదు. వెళ్ళిరండి" అన్నాడు కవి.

"మరి మిమ్మల్ని దింపడం?"

"వాడిని మనం దించటం ఎందుకో?" అంటూ శాస్త్రి కవి వైపు తిరిగి, "ఏరా, నీ స్కూటర్ లేదూ?" అన్నాడు.

"ఉంది" అన్నాడు. కవి నవ్వి, "కవుల ప్లాట్ కోసం నిరంతరాన్వేషకులు."

పాణీ, శాస్త్రీ బయటకొచ్చేరు. యింటివైపు వెళుతుంటే "ఇప్పుడు ఆ హోటల్ భోజనం ఎందుకులే? మా ఇంట్లోనే భోజనం చేద్దువు గాని" అన్నాడు. పాణి మౌనంగానే అంగీకారం తెలిపేడు. అప్పుడప్పుడు ఇలా స్నేహితులింట్లో భోజనం చెయ్యటం అతనికి అలవాటే.

ఇద్దరూ శాస్త్రి ఇంటికొచ్చేరు. తలుపు తట్టగానే శాస్త్రి చెల్లెలువచ్చి తలుపు తీసింది.

"యింకా నిద్రపోలేదా....?" అంటూ ఆప్యాయంగా చెల్లెల్ని అడిగేడు.

ఆ అమ్మాయి నిద్ర కళ్ళతో నవ్వి "నీ కోసమే చూస్తున్నాను" అంది.

"వీడు కూడా ఇక్కడే భోజనం చేస్తాడు" అన్నాడు శాస్త్రి.

పల్లవి 'అలాగే' నన్నట్టు తలవూపి లోపలికెళ్ళింది. కాళ్ళు కడుక్కుని వచ్చి కూర్చున్నారిద్దరూ.

"నాన్నా, అమ్మా నిద్రపోతున్నారా?" అడిగేడు శాస్త్రి.

"ఆహా! ఇప్పుడు టైమెంతయిందో తెలుసా? పదకొండు" అంది పల్లవి. "వాళ్ళు తొమ్మిదింటికే పడుకున్నారు."

"మరి నేను పెట్టుకుని తినేవాడినిగా-నువ్వు అనవసరంగా మేల్కోవటం దేనికి?" అన్నాడు. పల్లవి మాట్లాడలేదు. అంతలో శాస్త్రి పాణి వైపు తిరిగి, "చెప్పటం మరచిపోయాన్రోయ్. ఈ రోజు మన పల్లవికి ఓ సంబంధం వచ్చింది" అన్నాడు.

పాణి చప్పున తలఎత్తి పల్లవివైపు చూసి, "నిజంగా?" అన్నాడు. వడ్డిస్తూన్న కూరగిన్నె చటుక్కున టేబిల్ మీద వదిలేసి సిగ్గుతో బయటికి పరిగెత్తింది. పాణి బిగ్గరగా నవ్వి "అరె, అప్పుడే అంత సిగ్గెందుకు?రా" అంటూ పిలిచాడు. కానీ, ఆ అమ్మాయి మరి రాలేదు.

"ఎంతకీ ఎవరు?" అడిగేడు. శాస్త్రి వివరాలు చెప్పేడు.

భోజనం చేసి గదిలోకి వచ్చేక "మరి తను వెళ్ళిపోతే ఇంట్లో ఇలా తిరగటానికి ఎవర్నైనా తెచ్చుకోవద్దూ?" అని వక్కపొడి వేసుకుంటూ పాణి అడిగేడు.

శాస్త్రికి ప్రశ్న అర్థమైంది. నవ్వి, "ఆ విషయం ఆలోచించలేదు" అన్నాడు.

"మరి ఇంటిలో నీ విషయాలు చూసేది తనొక్కతేకదా" అన్నాడు పాణి. శాస్త్రి తన చెల్లెల్ని ఎంత అభిమానిస్తాడో అతనికి తెలుసు. వాడి కున్న బద్ధకానికి పల్లవేగానీ వాడి వెనుక అంతా సర్దూతూ ఉండకపోతే వాడి గదీ, వాడి వస్తువులూ ఎంత అస్తవ్యస్తంగా తయారవుతాయో కూడా అతనికి తెలుసు.

"నీ కేమైనా మతిపోయిందేమిటి- అందుకని పెళ్ళిచేసి పంపకుండా అలా ఉంచేస్తామా ఏమిటి?"

"అయితే, తొందర్లోనే మాకు విందు భోజనం ఉందన్న మాట" నవ్వేడు పాణి. శాస్త్రి మాట్లాడలేదు. అలాగే కిటికీలోంచి బయటికి చూస్తూ ఉండిపోయేడు. పాణి పక్కమీద దుప్పటిసర్దుతూ, "ఇక ఇలా మనం పద కొండింటికీ పన్నెండింటికీ వస్తే ఎవరూ తలుపుతీయరన్నమాట" అన్నాడు నవ్వి. శాస్త్రి దానికి మౌనంగా వుండిపోయేడు. పాణికి ఏదో అనుమానం వచ్చి, "శాస్త్రీ" అంటూ దగ్గరగా వెళ్ళేడు. శాస్త్రి వెనక్కి తిరిగేడు.అతని కళ్ళనిండా నీళ్ళు చూసి పాణి కలవరపడి, "ఏమిట్రా యిది?" అన్నాడు. శాస్త్రి నవ్వి, "ఏమీ లేదు. పల్లవి ఈ యింటిలో నుంచి వెళ్ళిపోవటాన్ని ఊహించుకుంటున్నానంతే" అన్నాడు.

"మరి ఇంత సెన్సిటివ్ అయితే ఎలా?"

"ఆ మాత్రం సెన్సిటివ్‌నెస్ లేకపోతే జీవితం కాజువల్ అయి పోదూ?" అన్నాడు శాస్త్రి నవ్వుతూనే.

"పల్లవి వెళ్ళిపోతుంది. కొంత కాలానికి ఇంకో అమ్మాయి నీ జీవితంలో భాగం పంచుకోవటానికి వస్తుంది. నీ అలవాట్లు గమనిస్తూ నిన్ను తీర్చిదిద్దుతుంది. ఆ ఆప్యాయతతో నువ్వు పల్లవిని మరచిపోతావ్" అన్నాడు పాణి. శాస్త్రి మాట్లాడలేదు. అంతలోనే పాణికి ఒక అనుమానం వచ్చింది.

"అంటే—ఒకలా ఆలోచిస్తే....పల్లవి స్థానాన్ని నీ భార్య భర్తీ చేస్తుందన్నమాట?" అన్నాడు సాలోచనగా.

"ఛా—చెల్లి, భార్య ఒకలా ఎలా అవుతారు?"

"కారు. నేనూ ఒప్పుకుంటాను. కానీ, ఇప్పుడు పల్లవి నిన్నెంత అభిమానిస్తుందో, రేపు నీ భార్యా నిన్ను అలానే అభిమానిస్తుంది. సెక్స్ వదిలిపెట్టు. అదిపోతే ఇద్దరూ నీకు దగ్గరవాళ్ళే?"

"కాదు. పల్లవిని నేను అభిమానిస్తాను, అంతే. మా ఇద్దరి మధ్యా ఉన్నది ఆప్యాయత మాత్రమే. నా భార్యకీ, నాకూ మధ్య వున్న అనుబంధం ఇంకొంచెం ఎక్కువే."

"ఏమిటి? సెక్సా?"

"అదొక్కటే కాదు. వీటన్నిటికీ అతీతమైనది యింకొకటి—ప్రేమ!"

"అదే నే నడుగుతున్నది. ప్రేమంటే ఆప్యాయత ప్లస్ సెక్స్ ప్లస్ ఇంకొకటి! ఆ ఇంకొకటి ఏమిటి?"

"సెక్స్ కంత ఇంపార్టెన్స్ ఇవ్వక ఉప్పొంగే ఆప్యాయతనీ, ప్రేమనీ వెలిబుచ్చటానికి అదొక మార్గం. కాబట్టి ఎంతో పెద్దదైన 'ప్రేమ'లో అదో భాగం-అంతే" అన్నాడు.

వెంటనే పాణి అన్నాడు. "అయితే ప్రేమంటే ఏమిటి?"

శాస్త్రిమాట్లాడలేదు. క్షణం నిశ్శబ్దంగా గడిచాక మళ్ళీ పాణి అన్నాడు "నీకో్క్రపం రాదంటే నిన్నో ప్రశ్న అడుగుతాను" అతని పక్కమీద కొచ్చి కూర్చుంటూ. "అడుగు" అన్నాడు శాస్త్రి.

"ఆ హీరోయిన్‌తో నేను మాట్లాడానూ అనగానే నువ్వు భయపడ్డది ఆ అమ్మాయిని నే నెక్కడ ప్రేమిస్తానోనని కదూ?"

"అహఁ నీమీద నమ్మకం లేక కాదు. ఆ అమ్మాయి ప్రతివాణ్నీ సిన్సియర్‌గా ప్రేమించినట్టు నటిస్తుంది. అనుభవం లేక నువ్వెక్కడ మోసపోతావోనని."

"అంటే నీ ఉద్దేశ్యం నేను సెన్సిటివ్‌ని కాబట్టి నా మొదటి అనుభవం ఇలా పాడవకుండా ఉండాలనే కదా నువ్వు హెచ్చరించింది."

"ఔను" అన్నాడు శాస్త్రి.

"మరి నీ ప్రేమించటం అనే అనుభవాన్ని మొట్ట మొదటిసారి భార్య దగ్గర కాకుండా చెల్లెలి దగ్గరే ఎందుకు పొందుతున్నావ్?"

"చెల్లెలూ, భార్యా ఒకరే ఎలా అవుతారు?" అన్నాడు శాస్త్రి కొంచెం కోపంగా.

"సీరియస్ కాకు మరి" అన్నాడు పాణి నవ్వి, ప్రేమ అనే విషయానికి సంబంధించినంతవరకూ ఇద్దరూ ఒక్కటేగా?"

శాస్త్రి క్షణం మాట్లాడకుండా ఆలోచిస్తూ వుండిపోయేడు. తరువాత అన్నాడు: "నీ వాదం ఒప్పుకోను నేను. చెల్లెలు ఇంట్లోంచి వెళ్ళిపోతుందనే భావంతోనే అభిమానిస్తాం. దానిలో పరిపూర్ణత్వం లేదు"

"అయితే, చెల్లెల్ని వదిలేయ్. పోనీ తల్లినీ?" అన్నాడు పాణి.

శాస్త్రి మాట్లాడలేదు.

* * * *

"నేనో అమ్మాయిని ప్రేమిద్దామనుకున్నాను" అన్నాడు పాణి.

శాస్త్రి నవ్వేడు. "ప్రేమిద్దామనుకోవటం ఏమిటి?" అన్నాడు గ్లాసు ఎత్తి గుటకవేస్తూ. బార్లో ఎక్కువమంది జనం లేరు నిశ్శబ్దంగా వుంది.

"నెలరోజుల క్రితం ఓ అమ్మాయితో పరిచయం అయిందిలే" అన్నాడు పాణి.

శాస్త్రి హుషారుగా ముందుకు వంగుతూ, "చెప్పు చెప్పు" అన్నాడు.

"ఏమీ లేదు. పరిచయం కొంచెం పెరిగింది. ఒక్కసారి పబ్లిక్ గార్డెన్స్‌కి కూడా వెళ్ళాం" అంటూ ఆగేడు.

శాస్త్రి ఆసక్తితో "తరువాత ఏమైంది?" అన్నాడు.

పాణి నవ్వేడు "ఏముంది? నేనే పరిచయాన్ని తెంచేసుకొన్నాను."

శాస్త్రి ఆశ్చర్యంగా "ఎందుకు?" అన్నాడు.

"నాలో ఏం చూసి ఆ అమ్మాయి నాతో పబ్లిక్ గార్డెన్స్ కొచ్చిందో నా కర్థంకాలేదు"

"నీతో పరిచయం పెంచుకొని, పెళ్ళిచేసుకొందామనుకుని ఉంటుంది."

"అంటే ఈ ప్రేమ స్వార్థంతో ఉద్భవించిన దన్న మాటేగా? ఒకవేళ నేను పెళ్ళిచేసుకోను- అని తెలిస్తే నాతో తిరుగుడుకు గుడ్‌బై చెప్పేసి ఇంకెవరన్నా తన వెనుక నాలుగురోజులు తిరిగితే అతనితో కలిసి ఇంకే కిద్వాయ్ గార్డెన్స్‌తో వెళుతుందన్నమాట"

"అవును ప్రేమించటంలో ఆ మాత్రం రిస్క్ ఎప్పుడూ ఉంటుంది" అన్నాడు శాస్త్రి.

"భయం వుంటే అది ప్రేమ ఎలా అవుతుంది?"

"సర్లే,ఇంతకీ ఆ అమ్మాయి విషయం ఏంచేసేవ్?" అన్నాడు శాస్త్రి నవ్వుతూ.

"నెలరోజులపాటు జరిగిన ఆ స్నేహం నాలో వ్యథనే కలిగించింది. అనవసరమైన మానసిక సంఘర్షణ! ఈ అమ్మాయి నన్ను ప్రేమిస్తుందా? లేకపోతే స్వార్థంతో రిస్క్‌తీసుకుంటూందా? ఇది తెలుచుకోవటం కోసం నేనూ ఒక రిస్క్ తీసుకొన్నాను."

శాస్త్రి ఆత్రుతగా "ఏం చేసేవ్?" అన్నాడు.

"ఒకరోజు నా రూమ్‌కి వచ్చినప్పుడు నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకొన్నాను."

శాస్త్రి ఒక్క గుక్కలో గ్లాసులో ద్రవం పూర్తిచేసి, "తరువాత?" అన్నాడు ఉత్సుకత భరించలేక.

"ఆ అమ్మాయి సుతారంగా నన్ను విడిపించుకొని, 'ప్లీజ్ ఇప్పుడొద్దు' అంది"

"మంచి అమ్మాయన్నమాట" అన్నాడు శాస్త్రి వెనక్కివాలుతూ.... "తరువాత ఏం జరిగింది?"

"ఆ అమ్మాయితో స్నేహం తెంపేసుకొన్నాను."

శాస్త్రి ఆశ్చర్యంతో "అదేం?" అన్నాడు.

"ఆ అమ్మాయి నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించటం లేదు. ప్రేమలో అనుమానాలకు తావులేదు. ఆమెలో నాపట్ల ప్రేమకన్నా జాగ్రత్తే ఎక్కువ వుంది. నిజమైన ప్రేమ ఇద్దరి మధ్యా ఒక తెగింపు, ప్రపంచం ఏమను కున్నా ఫర్వాలేదు....అనే పిచ్చితనం కలగజేస్తుంది. అంతేకానీ, అంత కాషన్ మైండెడ్ వుండదు" అన్నాడు పాణి.

"నువ్వు వెధవ్వి" అన్నాడు శాస్త్రి అంతా విని.

"ఎందుకు?" అన్నాడు పాణి నవ్వి.

"నిన్ను మాత్రం ఆ అమ్మాయి సిన్సియర్‌గా ప్రేమించాలా? నువ్వేమో ప్రేక్షకుడిలా దూరంగా నిలబడి ఎక్స్‌పెరిమెంట్లు చేస్తూం టావా?"

పాణి మాట్లాడలేదు. మళ్ళీ శాస్త్రే అన్నాడు.

"పోనీ, ఆ అమ్మాయి నీ మీద గుడ్డి ప్రేమతో ఒప్పుకుందనుకో, నువ్వేమంటావో తెలుసా? 'ఆ అమ్మాయికి నీతీ, నియమం లేవు. పెళ్ళి చేసుకోవటానికి శరీరాన్ని ఎరగా ఉపయోగించిందీ, అని."

"మరి అన్ని అనుమానాలతో ఎలా ప్రేమించటం?" అడిగేడు పాణి. శాస్త్రి నవ్వేడు. "ఎవర్నన్నా ప్రేమించాలీ అనుకొని మొదలు పెడితే అది ప్రేమకాదు. హృదయంలో స్పందన హఠాత్తుగా కలగాలి. అదీ ప్రేమంటే."

"ఎవర్ని చూచినా నాకు అలా కలగటంలేదు" అన్నాడు పాణి.

"అంటే నువ్వు ప్రేమరాహిత్యం అనే వ్యాధితో బాధపడుతున్నా వన్నమాట!" అన్నాడు శాస్త్రి నవ్వి. పాణి మాట్లాడలేదు. ఖాళీ గ్లాసుని వేళ్ళమధ్య తిప్పుతూ అలానే మౌనంగా ఉండిపోయేడు.

"ఏమిటి అలా మూడ్స్‌లోకి వెళ్ళిపోయేవ్?"

"ఏమీ లేదు" అన్నాడు పాణి- "నువ్వు చెప్పింది నిజమే! నేను పెరిగిన పరిస్థితులు అలాటివి. నా తల్లి చిన్నప్పుడే చచ్చిపోయింది. తండ్రో చరిత్రహీనుడు. చెల్లెళ్ళు లేరు. అందువల్ల దాదాపు ఒంటరిగానే పెరిగేను."

"కానీ, నువ్వు ప్రేమపట్లా, స్త్రీ పట్లా అంత గౌరవభావాన్ని పెంచుకోవటం అనవసరం. అలా పెంచుకొంటే ఈ రియలిజానికి తట్టుకో లేక దెబ్బతింటావ్" హెచ్చరించేడు శాస్త్రి.

"కాదు, అంతవరకూ వస్తే.... అసలు ప్రేమంటే ఏమిటో తెలుసుకోకుండా పెళ్ళిచేసుకోను....స్త్రీని ముట్టుకోను" దృఢంగా చెప్పేడు పాణి.

శాస్త్రి నవ్వేడు. "తాగేసి వెధవ నిర్ణయాలు తీసుకోకు" అన్నాడు.

పాణి సీరియస్‌గా "నువ్వే చూస్తావుగా?" అన్నాడు.

"ఏమిటి? ప్రేమంటే ఏమిటో తెలుసుకోలేకపోతే జీవితాంతం బ్రహ్మచారిగానే వుండిపోతావా?"

"అహఁ" అన్నాడు పాణి ఒక నిశ్చయానికి వచ్చినట్టు.

"సరేలే ఇక లే" అన్నాడు శాస్త్రి తానూ లేస్తూ. ఇద్దరూ బయటి కొచ్చేరు. శాస్త్రి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు.

"ఇటెక్కడికి?" అన్నాడు పాణి కారు ఆబిడ్స్ వైపు తిరగటం చూసి. "ఇక్కడో చిన్న పనుంది. అది చూసుకొని వెళదాం" అంటూ ఒక హోటల్ ముందు ఆపేడు. ఇద్దరూ కారు దిగేరు. ఆ హోటల్‌కి రావ టం పాణికి అదే ప్రథమం.

"అక్కడే ఆగిపోయేవేం? రా!" అన్న పిలుపుతో శాస్త్రిని అనుస రించేడు. ఇద్దరూ మెట్లెక్కి పైకి వస్తూంటే...."ఇక్కడేం పని?" అన్నాడు పాణి.

"ఒక ఫ్రెండును కలుసుకోవాలి" అంటూ ఒక రూమ్ ముందు ఆగి తలుపు తోసేడు.

"ఎవరతను?" అన్నాడు పాణి.

"నువ్వే చూడు" అన్నాడు శాస్త్రి నవ్వి. పాణి లోపలికి అడుగు పెట్టి చటుక్కున ఆగిపోయాడు. పక్కమీద బోర్లా పడుకొని పుస్తకం చదువుతున్న అమ్మాయి తలుపు చప్పుడుకు తల పక్కకు తిప్పి అతడిని చూసింది. పాణి చప్పున వెనక్కి తిరిగేడు. అప్పటికే శాస్త్రి బయట తలుపువేసి గెడ పెట్టేశాడు. పాణి తలుపు లాగుతూ, "ఒరేయ్....ఏమి టిది?" అన్నాడు కోపంగా.

శాస్త్రి కిటికీలోంచి చూస్తూ "సారీ బ్రదర్. నీ డెసిషన్ భయం వేసింది. అందుకనే" అంటూ నవ్వేడు.

"కానీ...." అంటూ ఏదో చెప్పబోయాడు పాణి.

"ఇంకేం చెప్పక. ప్రొద్దున్నే తలుపు తియ్యమని బోయ్‌కి చెప్తాను. ఈ హోటల్‌లో నేను ఎంత చెబితే అంత. రేపొద్దున్న వరకూ ఇందు లోనే వుండాలి నువ్వు" అని, "వసంతా" అంటూ పిలిచేడు గట్టిగా.

ఇప్పటివరకూ జరుగుతూన్నదంతా అర్థంకాక బిత్తరపోయి చూస్తూన్న ఆ అమ్మాయి కిటికీ దగ్గరకు పరుగెత్తుకువచ్చి, "నువ్వా శాస్త్రీ" అంది తేలిగ్గా ఊపిరి పీల్చుకొంటూ.

"ఆఁ నేనే" అన్నాడు శాస్త్రి నవ్వి.

"ఏమిటిదంతా?" అని ప్రశ్నించింది.

"ఏమీ లేదు, మా వాడికి కొత్త. కొంచెం ప్రేమంటే ఏమిటో నేర్పు" అన్నాడు శాస్త్రి. వసంతకూడా నవ్వింది. పాణి ఇంకా షాక్ నుంచి తేరుకో లేదు.

"మరి నేను వెళ్ళొస్తాను, గుడ్‌బై" అంటూ శాస్త్రి వెళ్ళిపోయేడు. వసంత కిటికీ తలుపులు మూసేసి, పాణి దగ్గరికి వచ్చింది. పాణి తనను గమనించటంచూసి, "ఏమిటి ఆలోచిస్తున్నారు" అంది నవ్వుతూ. పాణి మాట్లాడలేదు.

"మీరీ రాత్రంతా ఇక్కడేవుండాలి. అలా మాట్లాడకుండా బిగుసు కుపోతేఎలా?"

పాణి నవ్వేడు.

"అమ్మయ్య! కొంచెం కదిలేరు, చాలు" అంది వసంత నవ్వుతూ.

"అంటే, నేను జడుడిలాగానూ, అనాగరికుడిలాగానూ కనబడు తున్నానా?" అన్నాడు పాణి కోపంగా అతనికి ఒళ్ళు మండిపోతూంది.

"మీ స్నేహితుడేగా చెప్పారు!" అంది వసంత.

"ఏమని?"

"మా వాడికి కొత్త, ప్రేమంటే ఏమిటో నేర్పూ అని."

"వాడి మొహం. వాడో పెద్ద ఫూల్" అన్నాడు పాణి విసుగ్గా.

"ఆయన సంగతి ఇప్పుడెందుకు? మరి....నేను నేర్పనా!" అంది వసంత కొంటెగా.

"ఏమిటి?"

"మొదటి పాఠం" అంది వస్తూన్న నవ్వుని బిగపట్టి.

"అంటే?" అన్నాడు అర్థం కానట్టు పాణి. వసంత అతన్ని చటుక్కున పక్కమీదకు తోసి రెండు నిముషాలపాటు ఊపిరి సలపనివ్వకుండా అతని పెదవుల్ని నొక్కిపట్టి ముద్దుపెట్టుకొని, లేచి కూర్చుని "అదీ" అంది.

పాణి ఆమె మొహంలోకి సాలోచనగా చూస్తూ "ఇదేనా ప్రేమంటే" అన్నాడు నిర్లిప్తంగా. అతని ఉదాసీనతని చూసి ఆమె బెదిరింది.

ఒక క్షణం ఆమెవైపు తదేకంగా చూసి, "కాదు....ప్రేమని చూపించటానికి ఇదో మార్గం. అంతే, నాకున్న కొద్ది అనుభవంతో చెప్పు తున్నాను!—ఇదే ప్రేమ అంటే నే నొప్పుకోను" అన్నాడు.

"ఏమిటి, కవిత్వం మాట్లాడుతున్నారు?" అంది అతని ఛాతీమీద చెయ్యివేసి. అప్పుడు జ్ఞాపకం వచ్చిందతనికి తను మాట్లాడుతూన్నది ఒక సామాన్యమైన అమ్మాయితోనని.

"ఏమీ లేదు పడుకో" అన్నాడు జరిగి. ఆమె అతని పక్కనే చోటు చేసుకుని పడుకొని, అతనిమీద చెయ్యివేసింది. అతనన్నాడు-

"చూడా, మనసులో ఒకభావం వుంచుకొని పైకి ఒకలా మాట్లాడే మనిషిని కాను నేను. నా మనసులో ఒక భావం ఏర్పడింది. ప్రేమకి క్లైమాక్స్, సెక్స్ అని! దాన్ని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను నేను. అందువల్ల నువ్వు నా ముందు నగ్నంగా నిలబడినా నాకేమీ స్పందన కల గదు. ఇలాటి చీప్స్ ట్రిక్స్ ఏమీ నామీద ప్రయోగించక శుభ్రంగా నిద్రపో, రేపు పొద్దున్న వాడొచ్చి తలుపు తీసేవరకూ."

వసంత చప్పున అతని చేతులు పట్టుకొని "ఇన్నాళ్ళకి నాకో అన్నయ్య—" అంటూ ఏదో చెప్పబోయింది.

"ఎందుకీ ఆత్మవంచన? ఇద్దరిమధ్య సెక్స్ లేనంత మాత్రాన అన్నా చెల్లెళ్ళయిపోతారా? రేపు పొద్దున్న నీ గురించి ఎవరన్నా అస హ్యంగా మాట్లాడితే నడిబజార్లో నా చెల్లిని అలా అంటున్నందుకు వాడిని కొట్టాలా నేను? ఎవర్నిపడితే వాళ్ళని చెల్లెలుగా నే నొప్పుకోను. క్షమించు. గుడ్ బై" అన్నాడు పక్కకి తిరుగుతూ.

★ ★ ★ ★

"నీ అంత వెధవ, స్కౌండ్రల్ మరియు ఇడియట్ ఈ లోకంలో ఇంకెవరూ ఉండరు" అన్నాడు శాస్త్రి. పాణి మాట్లాడలేదు. శాస్త్రికి అను మానమేదో వచ్చి, "అసలు నువ్వు చెబుతూంది అంతా నిజమేనా?" అన్నాడు.

పాణి నవ్వి "నిజమే" అన్నాడు.

"వెధవా! అనవసరంగా వందరూపాయలు వేస్ట్ చేసేవు కదా!" అన్నాడు విసుక్కొంటూ. పాణి మౌనంగా వుండిపోయేడు. అంతలో క్రితం రాత్రి తాలూకు సంభాషణ జ్ఞాపకం వచ్చి అతని పెదవుల మీద సన్నగా చిరునవ్వు వెలిసింది. అది గమనించిన శాస్త్రి— "ఎందుకు నవ్వు తున్నావ్?" అని అడిగేడు.

పాణి నవ్వేసి, "ఏమీ లేదు. ఆ అమ్మాయి నిన్న రాత్రి నన్ను

అన్నయ్య అనేసింది. ఆడవాళ్ళు ఎంత తొందరగా ఆత్మవంచన చేసు కుంటారో చూడు" అన్నాడు.

శాస్త్రి కిటికీలోంచి బయటకు చూస్తూ క్షణం ఆలోచించి, "అందులో తప్పుందని అనుకోను" అన్నాడు.

"తప్పా—తప్పున్నరా! ఒకే రక్తాన్ని పంచుకొని పుట్టిన వాళ్ళ మధ్య బంధానికి 'అన్నా చెల్లెలూ' అని పేరు పెట్టేరు మన పెద్దలు. ఆ బాంధవ్యాన్ని తీసుకొచ్చి ఇంకెవరో అమ్మాయితో కలుపుతున్నానూ అంటే ఎలా?" అన్నాడు పాణి ఆవేశంగా.

"అదెలా? ఒక అమ్మాయిని చూడగానే అప్రయత్నంగా సోదర ప్రేమ కలగవచ్చు" అన్నాడు శాస్త్రి.

"సోదర ప్రేమా? అంటే ఏమిటి?"

"ఆ అమ్మాయికి ఆప్యాయత పంచి ఇవ్వాలనీ, ఆ అమ్మాయి అను రాగాన్ని పొందాలనీ వగైరా."

"అయితే, దాన్ని ధైర్యంగా 'స్నేహం' అను. మళ్ళీ ఆ 'చెల్లీ' అనే పేరెందుకు?"

"అమ్మాయితో ఉట్టి స్నేహం చేస్తోనంటే లోకం ఒప్పుకోదు, బ్రదర్" అన్నాడు శాస్త్రి.

"అంటే, మీరు ఈ అన్నా చెల్లెళ్ళ బంధాన్ని లోకానికి భయపడి పెట్టుకుంటున్నారన్న మాట, అంతేగా!" అన్నాడు.

శాస్త్రి మాట్లాడలేదు. మళ్ళీ పాణి అడిగేడు. "పల్లవి నీ చెల్లెలు. దానితో ఎప్పుడన్నా గంటల తరబడి మాట్లాడేవా?"

శాస్త్రి "లేదు" అన్నాడు.

"దానికెప్పుడన్నా ఒక చీరె కొని ఇచ్చేవా?"

శాస్త్రి తల అడ్డంగా ఊపాడు.

593

"దాని కెప్పుడైనా రెండు పేజీల ఉత్తరం వ్రాసేవా?"

శాస్త్రి తెల్లమొహం వేసి, "ఇవన్నీ నువ్వెందుకు అడుగు తున్నావో నాకు తెలియటం లేదు" అన్నాడు.

"సోదర ప్రేమ ముసుగులో మనుష్యులు చేసుకుంటున్న ఆత్మ వంచన గురించి."

"అంటే నీ ఉద్దేశ్యంలో తోడబుట్టిన చెల్లెల్ని తప్ప మిగతావాళ్ళ నందర్నీ ప్రియురాళ్ళగానే చూడాలంటావ్?"

"అనను. నీ తోడ బుట్టింది చెల్లెలు. నీతో జీవితాన్ని పంచుకొనేది ప్రియురాలు. మిగతావాళ్ళంతా స్నేహితులూ, స్నేహితురాళ్ళూ! అంతే."

"నీ మెదడు పూర్తిగా కుళ్ళిపోయింది" అన్నాడు శాస్త్రి సీరియస్‌గా. పాణి నవ్వి ఊరుకున్నాడు.

"అయితే, ఒక ప్రశ్నకి సమాధానం చెప్పు. స్నేహాన్నీ, ప్రేమనీ విడదీస్తున్న ఒకే ఒక పొర సెక్సా?" అడిగేడు శాస్త్రి.

"అదీ కాదు. ఎందుకంటే, ఒకవేళ నిన్నరాత్రి నేను ఆ అమ్మాయిని అనుభవించి వుంటే అది ప్రేమ కాదుగా?"

"మరి నీ ఉద్దేశ్యంలో ప్రేమంటే ఏమిటి?"

పాణి నవ్వి, "అది తెలుసుకోవాలనే ప్రయత్నం" అన్నాడు.

"అది తెలుసుకునేవరకూ పెళ్ళిచేసుకోవా?"

"చేసుకోను" దృఢంగా అన్నాడు పాణి.

అంతలో బయట తలుపు కొట్టిన చప్పుడు వినిపించింది. పాణి వెళ్ళి తలుపు తీసేడు, బయట టెలిగ్రామ్ బంట్రోతు. ఆదుర్దాపడుతూనే సంతకం చేసి టెలిగ్రామ్ విప్పేడు.

శాస్త్రి అతని పక్కన చేరి, "ఏమిట్రా అది?" అన్నాడు. పాణి దాన్ని చదివి ఊపిరి పీల్చుకొని, శాస్త్రి కిచ్చేడు.

"ఆంటీ వాంట్స్ యూ సూన్" అని చదివి, "ఏమిటిది?" అన్నాడు అర్థంకానట్టు.

"నాకు తెలియటంలేదు" అన్నాడు పాణి.

"ఇంతకీ ఎవరీవిడ?"

"మా అత్తయ్య—"

"బహుశా కూతుర్నివ్వటానికేమో!" అన్నాడు శాస్త్రి నవ్వి.

పాణికూడా నవ్వి, "అదేం కాదులే" అన్నాడు. "ఏం? కూతుళ్ళు లేరా?" అడిగేడు శాస్త్రి.

"ఉంది. కాని మా మామయ్యకి మేనరికాలు గిట్టవు. ఆయనో సోషియాలజీ ప్రొఫెసర్లే."

"మరెప్పుడు వెళతావ్?"

పాణి టైమ్ చూసుకొని, "ఇంకో గంటలో బస్సుంది. అందులో వెళతాను" అన్నాడు బట్టలు సర్దుకోవటానికి లేస్తూ.

పాణి ఊరు చేరుకునేసరికి రాత్రి ఎనిమిదయింది. అతణ్ని చూస్తూనే మామయ్య సంబరపడిపోయేడు.

"అత్తయ్య కెలా వుంది మామయ్యా?" కంగారుపడుతూ అడిగేడు, బాగ్ గదిలో మూలగా పెడుతూ.

"నాకేం? శుభ్రంగా ఉన్నాను" అంటూ వచ్చింది అత్తయ్య.

పాణికి అర్థంగాక "మరి టెలిగ్రామ్ ఎందుకిచ్చినట్టూ?" అన్నాడు వాళ్ళిద్దరివైపు మార్చి మార్చి చూస్తూ.

"ముందు భోజనం చెయ్యి, తరువాత మాట్లాడుకుందాం" అన్నాడు ఆయన.

భోజనం చేసి వరండాలో కూర్చున్నాక ఆయన ఉపోద్ఘాతంగా— "నీకు తెలుసుగా—అనూరాధని నీ కివ్వకపోవటానికి కారణం, నాకు మేనరికాలు గిట్టవని" అన్నాడు. పాణి తల ఊపేడు.

"అదే ఉద్దేశ్యంతో రాధకి నాలుగయిదు సంబంధాలు చూశాం. అన్నీ మంచి సంబంధాలే. కానీ నాలుగింటినీ అది తిరగగొట్టింది" అంటూ ఆగేడు ఆయన.

"ఎవర్నన్నా ప్రేమించిందేమో?" అన్నాడు పాణి.

"నాకూ అదే అనుమానం వేసింది" అన్నాడాయన వెంటనే.

పాణి కంగారుపడి, "వా డెవడో కనుక్కోమంటే మాత్రం నేను కనుక్కోలేను. అది అసలే మొండిఘటం" అన్నాడు.

ఆయన సీరియస్‌గా "అక్కర్లేదు. మీ అత్తయ్యే మంచి మాటలు చెప్పి వా డెవరో కనుక్కుంది" అన్నాడు.

"ఎవడుట?"

"నువ్వే!" అన్నాడాయన నవ్వి.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడి "నేనా?" అన్నాడు.

"ఆహా! అక్షరాలా నువ్వే!"

"ఇది-ఇదెలా సాధ్యం?" అన్నాడు పాణి.

ఆయన నవ్వి "నేను సోషియాలజీ ప్రొఫెసర్ని. ఫిజిక్స్ ప్రొఫెసర్నన్నా కాకపోయేను, ప్రేమకి టెలిలింక్స్ ఏమన్నా ఉన్నాయేమో కనుక్కోవటానికి" అన్నాడు.

"మరి ఇప్పుడెలా?" ఆలోచిస్తూ అన్నాడు.

"అదేదో పెద్ద అంతర్జాతీయ సమస్యలా ఆలోచిస్తా వేమిట్రా? దాన్ని పెళ్ళి చేసుకో."

పాణి బిత్తరపోయి, "దాన్నా. పెళ్ళా?" అని కొంచెం ఆగి "నేనా!" అని మళ్ళీ క్షణం ఆలోచించి, "నేనా?" అన్నాడు దిక్కుమొహం వేసి.

ఆయనకి ఒళ్ళు మండింది. "ఏరా, ఏదో మేనల్లుడివని ఊరుకుంటున్నాను. నీకెంత కట్నం కావాలో చెప్పు. అంతేకానీ...."

"మామయ్యా!" అంటూ గట్టిగా అరిచేడు పాణి.

"చాలా డామేజింగ్‌గా మాట్లాడుతున్నావ్ మామయ్యా నువ్వు. ఆదర్శపు పునాదులమీద నిర్మించుకున్న నా కలల భవంతిని ఒక్క క్షణంలో కూలదోసెయ్యటానికి ప్రయత్నిస్తే, దానికి దేవుడుకూడా క్షమించడు" అనేసి, అత్తయ్యవైపు తిరిగి, అదే విసురులో "రాధేదీ?" అన్నాడు. అతడ్ని బిత్తరపోయి చూస్తూ ఆవిడ అప్రయత్నంగా వేలెత్తి గదివైపు చూపించింది. పాణి పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ అటు వెళ్ళేడు.

పాణి అటు వెళ్ళగానే ఆయన అటువైపు తిరిగి, "ఏమే, ఇది ఈ నాటకాలవాడిని చేసుకుని ఏమన్నా సుఖపడుతుందంటావా?" అని అనుమానం వెలిబుచ్చేడు.

పక్క గదిలో జరిగే సంభాషణంతా జాగ్రత్తగా వింటూన్న అనూరాధ పాణి లోపలికి రావటాన్ని గమనించి, తలుపు చాటునుంచి పరుగెత్తుకు వెళ్ళి, టేబిల్ ముందు కూర్చుని, అందిన పుస్తకాన్నేదో తీసుకుని చదువుతున్నట్లు నటించసాగింది.

పాణి సరాసరి లోపలికి వచ్చేశాడు. ఎదురుగా ఉన్నది పెళ్ళికాని ఇరవై ఏళ్ళ అమ్మాయి అనైనా గమనించకుండా చేతులు పట్టుకుని "మామయ్య చెబుతున్నది నిజమేనా, అనూ?" అన్నాడు. అనూరాధ చప్పున అతని చేతుల్లోంచి చేతులు లాగేసుకుని మొహం దాచుకుంది. పాణి పక్కనే మోకాళ్ళమీద కూర్చుని, "ఇదంతా ప్రేమేనా?" అన్నాడు.

అనూరాధ మరింత సిగ్గుపడి "పో బాబూ, ఇక్కడేనుంచి" అంది.

పాణి ముందుకు వంగేడు.

★ ★ ★ ★

పాణి ముందుకు వంగి అన్నాడు.

"ఈ తెల్ల చీరెలో నువ్వెలా వున్నావో తెలుసా?"

అనూరాధ కళ్ళెత్తి అతనివైపు చూసింది. పాణి మందస్వరాన అన్నాడు. "నిన్నిలా చూచినప్పుడు వెన్నెలా, నువ్వు నవ్వినప్పుడు మల్లెలూ గుర్తొస్తున్నాయి రాధా, నాకు"

అనూరాధ నవ్వి అతని గుండెల్లో తల దాచుకుంది. "ఏమిటీ! ఇదంతా సిగ్గే" చిలిపిగా ప్రశ్నించాడు. అనూరాధ మరింతగా హత్తుకు పోయింది.

"బావని తప్ప ఇంకెవర్నీ చేసుకోను అన్నప్పుడు ఈ సిగ్గంతా ఏమైందో?" రెచ్చగొట్టాడు. కోపంగా చూడబోయి, సిగ్గు ముంచుకొచ్చి కళ్ళు దించేసింది ఆమె తలమీద గడ్డం ఆన్చి, ఆ రాగరంజిత రసాను బంధ ఆస్వాదనలో అలాగే కొంచెంసేపు వుండిపోయేడు.

"రాధా!" మృదువుగా పిలిచేడు.

"ఏం బావా?" కౌగిలిలోంచి విడవకుండానే అడిగింది.

"ఒక్క ప్రశ్న అడుగుతాను జవాబు చెబుతావా?"

"ఊఁ."

"ప్రేమంటే ఏమిటి?"

రాధ ఉలిక్కిపడి అతనివైపు చూసింది. పాణి మొహంలో ఎక్కడా చిలిపితనం కనిపించలేదు. ఆమె కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగేయి. చేతులలో మొహం కప్పుకొని "నాకేం తెలియదు బావా. నిజం, నన్ను నమ్ము" అంది.

పాణి కంగారుపడిపోయి, ఆమె భుజాలు పట్టుకుని కుదుపుతూ "రాధా, ఏమిటిది?" అన్నాడు.

"నిజం, బావా. నా మీద అనుమానం వద్దు. నిన్నే మనస్ఫూర్తిగా...." అంటూ ఏడ్చేసింది. తనెంత వెధవపని చేశాడో అప్పుడర్థమైంది. ఆమెని దగ్గరగా తీసుకుంటూ, "ఛా, నా ఉద్దేశ్యం అదికాదు. చాలాకాలం నుంచీ ఆ ప్రశ్నకి సమాధానం కోసం వెతుకుతున్నాను. నీకేమన్నా తెలుసునేమోనని...." అన్నాడు. రాధ తల ఎత్తి అతనివైపు చూస్తూ ఏదో చెప్పబోయింది. ఆమెని మరి మాట్లాడనివ్వలేదు అతను— ఆ వినీల నేత్రాలలో బేలత్వం, హేలగా ఊగే ముంగురులు, అర్ధవపు

తీరాన్నే నిలబడి సన్నిహితత్వాన్ని ఆపాదించుకున్న శిలల నునుపుదనాన్ని ధిక్కరించే చెక్కిళ్ళు....పాణి ముందుకు వంగేడు.

భయంతో వణికే పెదవిని మదువుగా అదిమిపెట్టి ప్రేమకోసం వెతుక్కొంటూ, క్షణకాలం ఆస్థిత్వపు స్పందన. అస్థిత్వం క్షణికం కాదు- క్షణం అసత్యం కానప్పుడు జీవితం క్షణికమైతేనేం? ఓ నిశీధిరాత్రి వినీలాకాశంలోంచి నిశ్శబ్దంగా జారిపోయే నక్షత్రం—- దట్టమైన అడవితో ఒకరోజు బ్రతికే గడ్డిపూవ్వూ— ఇవి చెబుతాయి జీవితానికి అర్ధం!

పేరుకున్న నిరాశావాదంలోంచి ఉద్భవించే అప్టిమిజంనిజం హక్కు విప్పితే ఈ విభావరీ సుందరి పయోధరాలపై ఎవరివీ ఈ నక్షత్రాలు? ఆ లోయల్లో పేరుకున్న నిశ్శబ్దం సేదతీరి విశ్రాంతి తీసుకోవాలనుకుంటే ఒక జీవితకాలం చాలదనిపించే నీరసం.

ఎన్ని కాంట్రడిక్షన్ల ముళ్ళు?

పక్కకి తిరిగి ఆమె చెయ్యి స్విచ్‌మీదకు వెళుతూందెందుకు? ప్రేమలో ఇంత కాన్షస్‌నెస్ ఏమిటి- అనుభవంలో ఆనందం లేదు, అను భూతిగా మారితే తప్ప!

ఆమెని పూర్తిగా ఆక్రమించుకొన్నాడతను.

జీవితంలో ప్రతి స్టేజీలోనూ రికన్‌సీలియేషన్.

★ ★ ★ ★

"నా కాడపిల్లే కావాలి" మారాం చేస్తున్నట్టు అడిగేడు పాణి.

అనూరాధ చిలిపిగా నవ్వి "అబ్బా, ఆశ!" అంది కొంటెగా.

"ప్లీజ్.... ప్లీజ్!" బ్రతిమాలేడు. "మొదటిది నే చెప్పినట్టు.... రెండూ మూడూ నీ ఇష్టం. మళ్ళీ నాలుగేమో!"

అనూరాధ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి, "ఏమిటి!?" అంది.

"ఫరవాలేదు లేవోయ్, పోషించేది నేనేగా? ఏదీ నీ చెయ్యి ఇవ్వు" అంటూ చేతిని తీసుకున్నాడు.

"ఎందుకు! జ్యోతిషం చెబుతారా?" అంది వచ్చే నవ్వుని ఆపుకుంటూ.

"అహ" అంటూ చేతిని పరీక్షగా చూసి, "ఒకటి— రెండూ— మూడు" అంటూ లెక్క పెట్టి, "అయిదుగురు పిల్లలు మనకి" అనూరాధ సిగ్గుపడి తల పక్కకి తిప్పుకుంది.

"ఇదేమిటి.... ఈ సిగ్గంతా రాత్రిళ్ళు ఎటు వెళ్ళిపోతుందో?" కవ్వించేడు.

"ఛీ!" అంటూ మరింత కుదించుకుపోయింది.

"ఏది ఏమైనా నాకు ఆడపిల్లే కావాలి" దృఢంగా అన్నాడు పాణి.

"ఎందుకో?" అంటూ ఓరగా చూసింది.

పాణి నవ్వలేదు. "ఎందుకో చెప్పలేను.... సాలోచనగా ఆగేడు. ఒకక్షణం తర్వాత అన్నాడు. "బహుశా నేను కోరే స్త్రీత్వాన్ని ఆపాదించటం కోసం అయి ఉండవచ్చు."

"కానీ, నాకో జ్యోతిష్కుడు ఏం చెప్పాడో తెలుసా?"

"ఏం చెప్పాడేమిటి?"

"మొదటి కాన్పు పురిట్లో నేను పోతానుట."

"రాధా!" అరిచేడు పాణి. "సరదాకి కూడా అలా మాట్లాడకెప్పుడూ"

అనూరాధ నవ్వింది. "నేన్నిజమే చెబుతున్నాను" అంది.

"ఊఁ సరేలే ఇక పడుకో" అంటూ పక్కకి తిరిగి ముసుగు దన్నేడు.

"మరేం" అంటూ ఏదో చెప్పబోయింది.

"నో.... నేనింకీ రాత్రి నీతో మాట్లాడను" అటువైపు తిరక్కుండానే అన్నాడు కోపంగా.

అనూరాధ అతని మీద చెయ్యివేసి, "అయితే, పిల్లి వచ్చే.... గప్ చిప్...." అంది నవ్వుతూ.

దాదాపు పన్నెండూ ఆ ప్రాంతాల్లో పాణికి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. చప్పున లేచి కూర్చుని స్విచ్ వేశాడు. అనూరాధ మూలుగుతూంది.

"రాధా, రాధా!" అంటూ తట్టేడు. రాధ కళ్ళు విప్పింది.

"ఏమిటి? ఏమైంది?" కంగారుగా అడిగేడు. ఆమెని చూస్తూ ఉంటే ఎంతో బాధని పళ్ళబిగువున అదిమి పెడుతున్నట్టు వెంటనే తెలుస్తూంది.

తలమీద చెయ్యివేసి, "ఏమైంది?" అన్నాడు. చేతిని గట్టిగా చెంపకి అదుముకొంటూ, "కడుపులో నొప్పి వస్తూంది, భరించలేను" అంటూ మళ్ళీ నొప్పిరావడంతో మెలికలు తిరిగి పోయింది.

క్షణంపాటు పాణికి ఏం చెయ్యాలో తోచలేదు. ఇంట్లో తను తప్ప ఇంకెవరూలేరు. అతను చూస్తూ ఉండగానే ఆమె బాధ భరించలేక కడుపు చేతితో పట్టుకుని తలగడలో మొహం దాచుకుంది.

పాణి చప్పున లేచి షర్టు వేసుకొన్నాడు.

"రెండు నిమిషాల్లో వస్తాను." కాజువల్‌గా అని తలుపు దగ్గరగా వేసి బయటకొచ్చేడు. వడివడిగా నడుస్తూ టైమ్ చూసుకొన్నాడు.

రెండున్నర.

అంతలో అతని ఇంట్లో రాధ ఒక్కతే వుంటుందన్న విషయం జ్ఞాపకం వచ్చింది. అది గుర్తొచ్చిన తరువాత మామూలుగా నడవలేక పోయాడు. మిగిలిన వందగజాలు దాదాపు పరుగెత్తి గమ్యం చేరుకున్నాడు చల్లగాలి బలంగా వీస్తున్నా అతని నుదురంతా చెమట పట్టేసింది.

మెట్లెక్కి తలుపు దబాదబా బాదేడు, అరనిమిషం తరువాత లోపల అలికిడి వినిపించింది. "ఎవరదీ?"

"నేనూ....పాణిని" ఆ మాత్రం ఆలస్యం కూడా భరించలేనట్టు అన్నాడు.

డాక్టరుగారు తలుపుతీసి పాణిని చూసి "ఏమిట్రా అర్ధరాత్రిపూట వచ్చేవ్?" అన్నాడు.

"రాధకి కడుపులో నొప్పివస్తూంది, భరించలేక పోతోంది."

ఆయన కంగారుపడి లోపలికి వెళ్ళి షర్టు వేసుకొని, మెడికల్ చెస్ట్ పట్టుకొని వచ్చి "పద" అన్నాడు.

ఇద్దరూ ఇంటికి చేరుకొనేసరికి రాధ పరిస్థితి అలాగే వుంది.

ఆయన ఆమెను పరీక్షిస్తున్నంత సేపూ పాణి ముళ్ళమీద నిల బడ్డట్టే ఉన్నాడు.

ఆయన ఇంజెక్షనిచ్చి బయటి కొస్తూండే పాణి ఆత్రుతగా "ఎలా ఉందండీ?" అని అడిగేడు.

"ఏమీలేదు తగ్గిపోతుంది."

పాణి కొంచెం తటపటాయించి, "అబార్షన్ కాదుగా" అన్నాడు. ఆయన నవ్వి, అతని భుజం మీద చేయి వేసి, "నువ్వేం కంగారుపడకు పొద్దున్న కల్లా అంత సర్దుకొంటుంది." అని, అతని చేతిలో నాలుగు మాత్రల పాకెట్ ఇస్తూ "గంట కొకటి వెయ్యి" అన్నాడు.

ఆయన్ని సాగనంపటానికి బయటికొచ్చేడు.

"నేను మళ్ళీ రేపొద్దున్నే వస్తాను, ఈ లోపులో ఏదన్నా కంగారు చేస్తే వెంటనే రా. హాస్పిటల్ కి తీసుకెళదాం."

పాణి అప్రయత్నంగా తల ఊపేడు. ఆయన వెళ్ళిపోయిన తరు వాత కూడా ఒక క్షణం అలాగే అచేతనంగా నిలబడి, నెమ్మదిగా లోపలి కొచ్చాడు. రాధ నిస్త్రాణంగా పడుకొని ఉంది.

"ఎలా వుంది?" పక్క మీద కూర్చుంటూ అడిగాడు.

నీరసంగా నవ్వి, "ఫరవాలేదు. కొద్దిగా తగ్గింది" అంది. మాత్ర ఇచ్చి, మంచినీళ్ళు అందించేడు. అది వేసుకొని పడుకొంది. ఆమె మంచం దగ్గిరగా కుర్చీ లాక్కొని కూర్చున్నాడు.

మూడయింది.

చిన్న పిల్లతెమ్మెర అలలా వచ్చి కాలెండర్ని కదిపింది. సృష్టి అంతా ఏదో చిత్రమైన అనుభూతి పొందుతూ నిశ్శబ్దంగా ఉంది. దూరంగా ఎక్కడో తీతువు పిట్ట వికృతంగా అరిచింది. మళ్ళీ నిశ్శబ్దం.

అకస్మాత్తుగా పాణికి భయం వేసింది. ఏవో రెండు-చేతులు తను విశ్వసించగలిగే రెండు చేతుల మధ్య అంతా మరచిపోయి నిశ్చింతగా విశ్రాంతి తీసుకోవాలనే తపన!

కిటికీలోంచి వెన్నెల జల్లు పడుతూంది. టేబిల్ లైట్ వెలుతురు గోడల మీద ప్రతిబింబిస్తూంది. అంతా నిశ్శబ్దం.

టైమ్ చూసుకొన్నాడు.

నాలుగు.

లేపి మాత్ర ఇద్దామనుకున్నాడు. రాధ గాఢంగా నిద్రపోతూంది. నిద్ర పాడు చెయ్యడం ఇష్టం లేకపోయింది. మాత్ర ఇవ్వకపోతే మళ్ళీ ఏదన్నా ప్రమాదిస్తే? శాస్త్రిని అడుగుదామనుకొని, మళ్ళీ నవ్వు కొంటా దేమోనని ఊరుకున్నాడు.

అయిదు నిమిషాలు మీమాంస-వద్దనే నిర్ణయానికొచ్చేడు.

అనూరాధ పక్కకి తిరిగి పడుకొంది. వత్తయిన వెంట్రుకలు చెంప మీద నుంచి పక్కకి జారితే పాపికొండల మధ్య ఒయ్యారంగా మెలికలు తిరిగే గోదావరి అతనికి జ్ఞాపకం వచ్చింది. "నీకూ నాకూ మధ్య వీడలా పడిన నిశీథి నీ జుట్టు" ఎవరు వ్రాసేరు? రాధ కోసమేనా?

ఇప్పుడిప్పుడే గాంభీర్యాన్ని నింపుకొంటున్న అనూరాధ....కొండ ల్లోనూ కోనల్లోనూ దూకుడుగా పారే సెలయేరు జీవనదై ఒడుదుడుకుల్ని తనలో నింపుకొన్నట్లు— ఎంత చిలిపిగా అల్లరిచేసేది ఒకప్పుడు! తను మాత్రం — ఏమైపోయింది తన అల్లరంతా? తనూ పెద్దవాడై పోతున్నాడు. బాధ్యత తెలుస్తూంది. తనకో పాప. తరువాత ఇంకో పాప— ఈ ఎమో షన్స్ ఉండవప్పుడు. వీటికన్నా అతీతమైన బంధం - చాలా గౌరవప్రద మైన అనుబంధం.

అనూరాధ కళ్ళు విప్పింది. ఎదురుగా కుర్చీలో కూర్చుని నిద్ర లేమి వల్ల ఎర్రబారిన కళ్ళతో తనవైపు తనలోంచి శూన్యంలోకి చూస్తూ కూర్చున్న భర్తని చూసి కంగారు పడింది.

ఆమె కళ్ళు విప్పటం చూసి పాణి ఆత్రుతగా ముందుకు వంగి, "ఎలా వుంది?" అన్నాడు. ఆమె నవ్వి, "బాగా కంగారు చేసేనా?" అంది. పాణి మాట్లాడలేదు. ఆమె దృష్టి మాత్రల మీద పడింది. "డాక్టర్ గారు వచ్చేరా" అడిగింది.

"ఆఁ, రెండింటికి" అన్నాడు పాణి. "లేచి మొహం కడుక్కో, మాత్ర వేసుకొందువు గాని."

రాధ అతన్నే పరీక్షగా చూస్తూ, "అప్పట్నించీ మెలకువగానే ఉన్నారా?" అంది.

"ఆయన గంటకోసారి ఈ మాత్రలు వెయ్యమన్నారు. నువ్వేమో గాఢ నిద్రలో ఉన్నావు. లేపలేదు నేను" సంజాయిషీ ఇస్తున్నట్లు చెప్పేడు.

"మీరు పడుకోవచ్చుగా. అనవసరంగా నిద్ర పాడు చేసుకోవటం దేనికి?" అంది. పాణి ఆమెనో చిన్నపిల్లని చూసినట్టు చూసి, "నీ మొహం నీకు తెలిసుదులే ఆ వర్రీ" అన్నాడు.

రాధ అతని వైపు తదేకంగా ఓ క్షణం చూసి, "ఒకసారి ఇలా వస్తారా?" అంది.

పాణి అర్థం కానట్టు "ఎందుకు?" అన్నాడు.

"చెబుతాను."

పాణి ఆమె దగ్గరగా వెళ్ళి మంచం మీద కూర్చున్నాడు. ఆమె మందస్వరాన అంది. "నాకేం తెలియదు. తెలుసుకొనే జ్ఞానం లేదు. అందుకే మీ ప్రశ్నకి ఆ రోజు సమాధానం చెప్పలేకపోయేను. అంత భాష రాదు నాకు. కానీ—"

పాణి అయోమయంగా ఆమె వైపు చూస్తూ "ఏమిటి నువ్వు చెబుతూంది" అన్నాడు.

ఆమె అతని జుట్టులోకి వేళ్ళు జొనిపి, చప్పున అతన్ని దగ్గరగా లాక్కొని నుదుటి మీద ముద్దు పెట్టుకొని, "అర్థమయిందా ప్రేమంటే?" అంది.

.... ★ ....